

చంద్రుగొండ: తిప్పనపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిక



చంద్రుగొండ: పోకలగూడెంలో ఇంటింటి ప్రచారం

# బీఆర్ఎస్‌లో చేరిక

చంద్రుగొండ, నవంబర్ 27: మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కుటుంబాల వారు సోమవారం జడ్పీటీసీ సభ్యుడు కొణకండ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### ఇంటింటి ప్రచారం

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 27: మెచ్చా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని నారాయణపురం, తిరుమలకుంట, ఆసుపాక, నందిపాడు, మల్లాయిగూడెం, గుమ్మడవల్లి, కావడిగుండ్ల, కన్నాయిగూడెం, కేశప్పగూడెం, జమ్మిగూడెం, అచ్యుతాపురం, నారంవారిగూడెం, అల్లిగూడెం, పాపిడిగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జక్కుల రాంబాబు, చిన్నంశెట్టి పల్లవి, జుజ్జూరి వెంకన్నబాబు, రాంబాబు, పానుగంటి లక్ష్మణరావు, కొనకళ్ల శ్రీనివాసరావు. ఆళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ, నవంబర్ 27: మండలంలోని పోకలగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుగులోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట రూరల్: నారాయణపురంలో ప్రచారం



అశ్వారావుపేట రూరల్: తిరుమలకుంటలో ప్రచారం

## భారీగా మద్యం సీసాల పట్టివేత

చింతకాని, నవంబర్ 27 : మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చింతకాని నుంచి అక్రమ మద్యం తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మార్గమధ్యంలో సెక్టోరియల్ అధికారి ఎంపీడీవో శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.41,158ల ఉంటుందని, మద్యం బాటిళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపారు.

## మధిరలో నైతిక విజయం బీఆర్ఎస్‌దే..

చింతకాని, నవంబర్ 27 : అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినా.....ఓడినా నిత్యం మధిర ప్రజలతోనే ఉన్నానని, భట్టి అగ్రిమెంట్ రాసివ్వడంతో మధిరలో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీదని తేలిపోయిందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. రామకృష్ణాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలప్పుడు కనిపించే ఎమ్మెల్యే కావాల్నా... నిత్యం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే కావాల్నా.. అని ఓటర్లను ప్రశ్నించారు.



కొత్తగూడెం టౌన్: గణేశ్ టెంపుల్‌లో కార్తీక దీపాలు



పాల్వంచ రూరల్ : పెద్దమ్మ గుడిలో సామూహిక సత్యనారాయణ వ్రతం

# కనుల పండువగా కార్తీక పౌర్ణమి

కొత్తగూడెం టౌన్, నవంబర్ 27 : కార్తీక పౌర్ణమి వేళ జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలు శోభాయమానంగా మారాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్‌లో ఉన్న శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి. ఆలయ ఆవరణలో కనకదుర్గ అమ్మవారు, దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంతోపాటు ఉసిరిచెట్టు వద్ద, నాగేంద్రస్వామి విగ్రహం వద్ద, నవగ్రహాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. వేకువజామునే నిద్రలేచి కుటుంబ సభ్యులంతా తలస్నానాలు ఆచరించి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం రాత్రి గణేశ్ టెంపుల్ ఆధ్వర్యంలో జ్వాలాతోరణం వేడుక జరిగింది. భక్తులు శ్రీ స్వర్ణ దుర్గ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని తరించారు. శివలింగానికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.

### పెద్దమ్మ గుడిలో చండీహోమం

పాల్వంచ రూరల్, నవంబర్ 27 : మండలంలోని పెద్దమ్మగుడిలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చి మండపారాధాన, గణపతి పూజలు చేశారు. పాల్వంచ, జగన్నాథపురం, బూర్గంపాడు తదితర ప్రాంతాల నుంచి 25 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష్మీదేవిపల్లి విరాట్‌నగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వత్రం నిర్వహించారు. ఈవో రజనీకుమారి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

జూలూరుపాడు, నవంబర్ 27 : మండలంలోని పాపకొల్లు గ్రామంలో కాకతీయులకాలం నాటి ఉమాసోమలింగేశ్వస్వామి ఆలయం, కాకర్ల గ్రామంలోని సంతాన వేణుగోపాలస్వామి, సుబ్రమణ్యస్వామి, నాగేంద్రస్వామి ఆలయం, పడమటనర్సాపురం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, సమ్మక్క-సారలమ్మ, వెంగన్నపాలెం గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయం, జూలూరుపాడులోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

చుంచుపల్లి, నవంబర్ 27 : మండలంలోని గౌతంపూర్ పంచాయతీలో ఉన్న శ్రీ కనకదుర్గ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పుట్టల వద్ద పాలు పోసి దీపారాధన నిర్వహించారు.

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 27: మండలంలోని నారంవారిగూడెం కాలనీలోని ఓంకార కాశీనాథుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక సోమవారం, పౌర్ణమి ఒకే రోజు రావడంతో దేవాలయలు భక్తులతో కిటకిటలాడాయి. వినాయకపురంలోని చిలకలగండి ముత్యాలమ్మ, యంత్రరాజసహిత కాళేశ్వర స్వామి, నారాయణపురంలోని కట్ట మైసమ్మ, గోగులపూడిలోని గుబ్బల మంగమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నారంవారిగూడెం కాలనీలోని ఆలయంలో ఆకాశ దీపం వెలిగించారు. ఆలయం ముందు భాగంలో శివలింగాకారంలో వత్తులు వెలిగించారు.

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 27: కార్తీక సోమవారం వేడుకలను భక్తులు శివాలయాల్లో జరుపుకున్నారు. తెల్లవారుజామున శివలింగానికి పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. స్వామి వారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం రాత్రి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జ్వాలాతోరణం పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతిని వెలిగించారు. 365 వత్తులను వెలిగించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 27: స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు కార్తీక మాస పూజలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అర్చనలు, ధూపదీప నైవేద్యాలు, మహానివేదన నిర్వహించారు. భక్తులు జ్యోతులను వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించారు. చిన్నారులకు చెవి పోగులను కుట్టించారు.

దమ్మపేట, నవంబర్ 27: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.



మణుగూరులో..



దమ్మపేట: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అశ్వారావుపేట టౌన్: శివాలయంలో జ్యోతి వెలిగిస్తున్న మహిళలు



అన్నపురెడ్డిపల్లి: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



జూలూరుపాడు : సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల కిటకిట



చుంచుపల్లి : కార్తీక పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు